TRUTH | PEOPLE | NATION

ప్రజల పక్షం.. ప్రజా స్వరం..

# రిపబ్లిక్ హిందుస్థాన్

REPUBLIC HINDUSTHAN TELUGU DAILY

NEWS VIEWS FOR A BETTER TOMORROW

సత్యం కోసం.. సమాజం కోసం.. భారతం కోసం..

సంపుటి: 2 సంచిక: 140 | శుక్రవారం 02 అక్టోబర్ 2026 | ఆదిలాబాద్ | హైదరాబాద్ | ఎడిటర్ : రాథోడ్ రాజు | పేజీలు : 4 | వెల: రూ.2.00



2వ పేజీలో...

భారత పైలట్ స్మిత్ మచ్చర్ కుటుంబానికి

## మోదీ ఫోన్

**అండగా ఉంటామని ప్రధాని భరోసా**

- ఫ్లైదుబాయ్ విమానంలో భారత పైలట్‌పై సహ పైలట్ కత్తితో దాడి
- తీవ్ర గాయాలతోనూ 174 మంది ప్రయాణికులను కాపాడిన కెప్టెన్
- స్మిత్ ధైర్యాన్ని కొనియాడి, పూర్తి సహాయం అందిస్తామని హామీ

డిల్లీ: ఫ్లైదుబాయ్ విమానంలో సహ పైలట్ చేతిలో కత్తి దాడికి గురై, తీవ్ర గాయాలతోనూ ప్రయాణికులను కాపాడిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ కుటుంబంతో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. స్మిత్ చూపిన అసామాన్య ధైర్య సాహసాలను ప్రధాని కొనియాడారు. నిన్న దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానంలో ఈ ఘటన చోటుచేసుకుంది. విమానం గాల్లో ఉండగా.. కో-పైలట్ అకస్మాత్తుగా కెప్టెన్ స్మిత్‌పై కత్తితో దాడికి పాల్పడ్డాడు.

లక్షలాది యువత ఆకాంక్షలకు

## ప్రతీక యూపీఎస్సీ

ఢిల్లీ,: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) వందేళ్ల ప్రస్థానం లక్షలాది మంది యువత ఆకాంక్షలకు, దేశ ప్రజల నమ్మకానికి ప్రతీక అని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. గురువారం ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూపీఎస్సీ శతాబ్ది స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌తో పాటు '100 ల్యాండ్‌మార్క్ జడ్జిమెంట్స్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. నిన్న జరిగిన ఒక విమాన ప్రమాద ఘటనలో అసాధారణ ధైర్య సాహసాలు ప్రదర్శించిన భారత పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. "నిన్న జరిగిన ఘటనలో భారత పైలట్ కెప్టెన్ స్మిత్ చూపిన ధైర్యం, సమయస్ఫూర్తి, నిబద్ధత ప్రశంసనీయం. ఇజ్రాయెల్ ప్రధాని చెప్పినట్లుగా, 9/11 తరహా ఘోర విషాదాన్ని ఒక భారతీయుడు అడ్డుకున్నాడు" అని మోదీ అన్నారు.



2వ పేజీలో...

- యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ
- స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌ను ఆవిష్కరించిన ప్రధాని
- లక్షలాది మంది యువత ఆశయాలకు యూపీఎస్సీ ప్రతీక అని వ్యాఖ్య
- సర్దార్ పటేల్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ సేవలను స్మరించుకున్న ప్రధాని
- భారత పైలట్ స్మిత్ ధైర్యాన్ని కొనియాడిన మోదీ



ఆస్తులపై విచారణకు..

## సిద్ధమా?

2వ పేజీలో...

**సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్**

హైదరాబాద్: సిరిసిల్లలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ (ఖు=) కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశం లో ఆయన మాట్లాడారు. తాతల కాలం నుంచి మా ఆస్తులు, మీ ఆస్తులపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణకు సిద్ధమా? అని కేటీఆర్ సవాల్ విసిరారు. సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే విచారణకు రావాలని డిమాండ్ చేశారు. తమది తప్పని తేలితే ఏ శిక్షకైనా సిద్ధమేనని స్పష్టం చేశారు. "నా బండారం బయటపెడతానని రేవంత్‌రెడ్డి నిన్న సిరిసిల్ల వెళ్లారు. శత్రుదేశంపై దండయాత్రకువెళ్లినట్టు కాంగ్రెస్ నేతలు వెళ్లారు. అంతమంది పోలీసులు ఎందుకు.. అరెస్టులు ఎందుకు? నిన్న సీఎం సభలో పోలీసులు తప్ప ఎవరూ లేరు. మా తాతకు వందల ఎకరాలు ఉండేవి. కేసీఆర్ ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రి, కేంద్రమంత్రి, డిప్యూటీ స్పీకర్‌గా పనిచేశారు. అమెరికాలో ఆరేళ్లు ఉద్యోగం చేశాను.. ఎంతో కొంత సంపాదించా. ఆ డబ్బులతో 2006లో ఒక హోటల్ పెట్టాను. నాడు ఒక హోటల్ పెడితే.. ఇప్పుడు మూడు హోటళ్లు అయ్యాయి. నేను రాజకీయాల్లో లేకపోయుంటే.. పది హోటళ్లు చేసేవాడిని. నా హోటళ్లకు రేవంత్‌రెడ్డి నిన్న ఫ్రీ పబ్లిసిటీ ఇచ్చారు.



2వ పేజీలో...

మమతా వర్గానికి

## సుప్రీంలో చుక్కెదురు

**రూ.804 కోట్ల ఖాతాలపై పిటిషన్ కొట్టివేత**

- స్తంభింపజేసిన టీఎంసీ ఖాతాలపై మమతా వర్గం పిటిషన్ కొట్టివేత
- నాలుగు బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ. 804 కోట్ల నిధులపై విచారణ
- హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసిన సుప్రీంకోర్టు
- పార్టీలో వర్గపోరు తేలేవరకు నిధులపై నిర్ణయం కష్టమన్న ధర్మాసనం
- కేసు విచారణను వేగవంతం చేయాలని కలకత్తా హైకోర్టుకు సూచన



2వ పేజీలో...

బీఆర్ఎస్‌తో పొత్తుపై కిషన్‌రెడ్డి

## కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీతో పొత్తుపై బీజేపీ సీనియర్ నాయకుడు, కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. గురువారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీతో బీజేపీ ఎటువంటి పొత్తు పెట్టుకోదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ ముందుకు వచ్చినా తాము సిద్ధంగా లేమని చెప్పారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో తమ పార్టీ విజయం సాధిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. "తెలంగాణలో బీఆర్ఎస్‌తో బీజేపీ పొత్తు ఉండదు. బీఆర్ఎస్‌తో పొత్తు ఉంటుందని ఎవరు అంటున్నారు? బీఆర్ఎస్‌తో పొత్తు ఎవరు కోరుకోవడం లేదు. మొదట కేటీఆర్ ఆయన చెల్లెలు కవితతో కలిసి ఉండాలి. కేసీఆర్ కుటుంబమంతా ఐక్యంగా ఉంటే చాలు. మేము వాళ్లతో కలవాల్సిన అవసరం లేదు. ఖైరతాబాద్‌లో లాస్ట్ టైం పొరపాటున ఓడిపోయాం. ఈసారి వందకు వంద శాతం సీటు నిలబెట్టుకుంటాం.

## చరిత్రకు జీవం



నిజాంలు నీళ్లు తాగిన బావికి

## హైడ్రా పునరుజ్జీవం

- పాతబస్తీలోని చారిత్రక బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువు కింద ఉన్న పురాతన బావి
- సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో హైడ్రా ఆధ్వర్యంలో పునరుద్ధరణ పనులు ప్రారంభం
- నిజాంల కాలంలో ఔషధ గుణాలున్న నీటిని అందించిన బావిగా ప్రత్యేక గుర్తింపు
- వారసత్వ పరిరక్షణ, పర్యావరణ అభివృద్ధి లక్ష్యంగా ఈ ప్రాజెక్టు రూపకల్పన

హైదరాబాద్ : హైదరాబాద్ నగరం అంటే కేవలం కాంక్రీట్ జంగిల్ కాదు, అడుగడుగునా చారిత్రక వైభవానికి, సాంస్కృతిక వారసత్వానికి నిలువుటద్దం. ముఖ్యంగా పాతబస్తీ గల్లీల్లో తిరిగితే శతాబ్దాల నాటి కథలు మనల్ని పలకరిస్తాయి. అలాంటి ఓ అద్భుతమైన చారిత్రక కట్టడానికి ఇప్పుడు పునరుజ్జీవం లభిస్తోంది. శివరాంపల్లిలోని 356 ఏళ్ల నాటి బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువును ఇటీవలే పునరుద్ధరించి నగరానికి ఓ మణిహారంగా అందించిన 'హైడ్రా', ఇప్పుడు అదే చెరువు కింద ఉన్న ఓ పురాతన ఊట బావికి ప్రాణం పోస్తోంది.



అమెరికాకు నో చెబుతున్న

## న్యూ ట్రెండ్

హైదరాబాద్,:ఇంజినీరింగ్ పూర్తయిందంటే అమెరికాలో ఆ తర్వాత అక్కడే ఉద్యోగం. ఇదే లక్ష్యంగా వేలాది మంది విద్యార్థులు భారీ మొత్తంలో డబ్బు ఖర్చు చేసేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి క్రమంగా మారుతోంది. అమెరికా వీసా నిబంధనల్లో మార్పులు, అక్కడి ఉద్యోగ మార్కెట్‌లో అనిశ్చితి, విదేశీ విద్యపై పెరుగుతున్న ఖర్చులు.. ఇవన్నీ విద్యార్థులను మరోసారి ఆలోచించే లా చేస్తున్నాయి. ఇంజినీరింగ్ విద్యార్థుల్లో కొంతకాలంగా కనిపిస్తున్న కొత్త ట్రెండ్ ఇదే. గతంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌ను ఒక ఆప్షన్‌గా మాత్రమే చూసిన విద్యార్థులు.. ఇప్పుడు దానినే మొదటి ప్రాధాన్యతగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. అమెరికాలో ఓా కోసం లక్షల రూపాయలు ఖర్చు చేసి వెళ్లడం కంటే.. స్వదేశంలోనే ఉద్యోగం సంపాదించి రెండుమూడేళ్లు అనుభవం పొందితే ఎలా ఉంటుందనే ఆలోచన పెరుగుతోంది. ముఖ్యంగా కుటుంబంపై భారీ ఆర్థిక భారం పడకుండా ఉండటం, ఉద్యోగ భద్రత ఉండటం విద్యార్థులను క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ వైపు మళ్లిస్తోంది. ఈ మార్పు విద్యార్థుల ఆలోచనల్లోనే కాదు.. ఇంజినీరింగ్ కాలేజీల్లోనూ కనిపిస్తోంది. గతంలో చివరి ఏడాదిలో ప్లేస్‌మెంట్ కోసం సిద్ధమయ్యే విద్యార్థులు.. ఇప్పుడు రెండో సంవత్సరం నుంచే కోడింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ ప్రిపరేషన్‌పై దృష్టి పెడుతున్నారు. క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లకు ముందుగానే రిజిస్టర్ చేసుకుంటున్నారు.



హై రైజ్ భవనాలకు పొంచి ఉన్న

## నీటి ముంపు

హైదరాబాద్,: భాగ్యనగరం సహా పలు ప్రధాన నగరాల్లో ఆకాశమే హద్దుగా వెలుస్తున్న హైరైజ్ భవనాలు, లగ్జరీ గేటెడ్ కమ్యూనిటీలలో వందలాది, వేలాది ఫ్లాట్లు నివాసం ఉంటున్నాయి. ఒకే ప్రాంగణంలో వేల సంఖ్యలో జనాభా నివసించే ఈ భారీ అపార్ట్ మెంట్లలో నిత్యం కోట్లాది లీటర్ల నీరు అవసరమవుతుంది. కేవలం భూగర్భ జలాలపై మాత్రమే ఆధారపడితే కొన్ని రోజుల్లోనే భూగర్భ జలాలు అడుగంటిపోవడం, బోర్లు పూర్తిగా వట్టిపోవడం ఖాయం. దీంతో నగరాల్లోని పెద్ద పెద్ద టవర్ల నిర్వహణకు నీటి సరఫరా అనేది ప్రస్తుతం అత్యంత ఆందోళనకరమైన సమస్యగా మారుతోంది.

# అమెరికాకు నో చెబుతున్న న్యూ ట్రెండ్



మొదటిపేజీ తరువాయి...

విదేశీ విద్యకు వెళ్లే ముందు ఉద్యోగం దొరికితే.. ఆ తర్వాత పరిస్థితులను బట్టి తదుపరి నిర్ణయం తీసుకోవచ్చని భావిస్తున్నారు. విద్యార్థులు క్యాంపస్ ఉద్యోగాల వైపు మొగ్గుచూపుతున్నప్పటికీ.. రిక్రూట్‌మెంట్ మార్కెట్ మాత్రం అంత ఆశాజనకంగా కనిపించడం లేదు. గత మూడేళ్లలో అనేక కాలేజీల్లో క్యాంపస్‌కు వచ్చే కంపెనీల సంఖ్య తగ్గినట్లు విద్యాసంస్థలు చెబుతున్నాయి. ఒకప్పుడు కొన్ని కాలేజీలకు 50 నుంచి 80 వరకు కంపెనీలు వచ్చేవని, ప్రస్తుతం కొన్ని చోట్ల ఆ సంఖ్య 20 నుంచి 30కి పడిపోయిందని చెబుతున్నారు. దీంతో ఉద్యోగం కావాలనే డిమాండ్ పెరుగుతున్న సమయంలో.. ఉద్యోగ అవకాశాల సంఖ్య మాత్రం తగ్గడం విద్యార్థులకు మరో సవాలుగా మారుతోంది. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో మరో సమస్య కూడా విద్యార్థులను ఆందోళనకు గురిచేస్తోంది. కొన్ని కంపెనీలు విద్యార్థులను ఎంపిక చేసి ఆఫర్ లెటర్లు ఇచ్చినప్పటికీ.. వెంటనే ఉద్యోగంలోకి తీసుకోకుండా నెలల తరబడి జాయినింగ్‌ను వాయిదా వేస్తున్న ఘటనలు కనిపిస్తున్నాయి. దీంతో ఉద్యోగం వచ్చిందనే సంతోషం ఉన్నా.. వాస్తవంగా ఎప్పుడు పని ప్రారంభిస్తామనే అనిశ్చితి విద్యార్థులను వెంటాడుతోంది. కొన్ని ప్రముఖ విద్యాసంస్థల్లోనూ ఇలాంటి ఆలస్యాలపై కంపెనీలకు సంబంధించి చర్యలు తీసుకున్న సందర్భాలు ఉండటం ఈ సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. అయితే విద్యార్థులు పూర్తిగా అమెరికా కలను వదులుకున్నారని చెప్పలేం. విదేశాల్లో చదువుకోవాలనే ఆసక్తి ఇంకా ఉంది. కానీ 'ముందు ఉద్యోగం.. తర్వాత విదేశీ ప్రయాణం' అనే వ్యూహం మాత్రం బలపడుతోంది. ఇండియాలో రెండుమూడేళ్లు పనిచేసి అనుభవం సంపాదించిన తర్వాత అమెరికా లేదా ఇతర దేశాలకు వెళ్లాలని కొందరు విద్యార్థులు భావిస్తున్నారు. ప్రారంభంలో జీతం తక్కువగా ఉన్నా.. చేతిలో ఉద్యోగం, అనుభవం ఉండటం వల్ల భవిష్యత్ నిర్ణయాలు తీసుకోవడం సులభమవుతుందని వారు భావిస్తున్నారు. ఒకప్పుడు విదేశీ విద్య అంటే అధిక జీతం, అమెరికా ఉద్యోగం, సెటిల్‌మెంట్ అనే కల కనిపించేది. ఇప్పుడు విద్యార్థులు రిస్క్, ఖర్చు, వీసా, ఉద్యోగ భద్రత వంటి అంశాలను కూడా లెక్కలోకి తీసుకుంటున్నారు. అందుకే అమెరికా వెళ్లడమే కెరీర్ విజయానికి ఏకైక మార్గం కాదనే భావన బలపడుతోంది. స్వదేశంలోనే మొదటి ఉద్యోగం సంపాదించి.. నైపుణ్యాలు పెంచుకుని.. అనుభవంతో తర్వాత విదేశీ అవకాశాలను పరిశీలించడం కొత్త కెరీర్ వ్యూహంగా మారుతున్నట్లు కనిపిస్తోంది. మొత్తంగా చూస్తే.. అమెరికా కలకు పూర్తిగా తెరపడకపోయినా, ఇంజినీరింగ్ విద్యార్థుల ప్రాధాన్యతలు మాత్రం మారుతున్నాయి. విదేశీ విద్య కోసం భారీ రిస్క్ తీసుకోవడం కంటే.. ముందుగా క్యాంపస్ ప్లేస్‌మెంట్ ద్వారా కెరీర్‌కు బలమైన పునాది వేసుకోవడానికే కొత్త తరం ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోంది.

# హై రైజ్ భవనాలకు పొంచి ఉన్న నీటి ముంపు

మొదటిపేజీ తరువాయి...

సాధారణంగా నగరాల్లో మున్సిపల్ కార్పొరేషన్లు , జలమండలి అందించే తాగునీటి సరఫరాపైనే ఈ హైరైజ్ ప్రాజెక్ట్‌లు ఆధారపడాల్సి ఉంటుంది. అయితే, మున్సిపల్ అధికారులు తగినంత నీటి కనెక్షన్‌లు లేదా మౌలిక వసతులు కల్పించని పక్షంలో ఆయా బిల్డర్లు, నివాసితు లు తీవ్రఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మున్సిపాలిటీ నుంచి సరైన సమయంలో నీటి సరఫరా అందకపోతే, ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా రోజువారీ నీటిని కొనుగోలు చేయాల్సి వస్తోంది. దీనివల్ల అపార్ట్‌మెంట్లలో నివసించే మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి కుటుం బాలపై ఆర్థికంగా అదనపు భారం విపరీతంగా పెరుగుతోంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా బిల్డర్లు ప్రాజెక్ట్ ప్రారంభ దశలోనే మున్సిపల్ జల సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను పరిశీలించాల్సి ఉంటుంది. మున్సిపాలిటీ నుంచి ప్రత్యేక పైప్‌లైన్ అనుమతులు పొందడం, భారీ సంపులు , ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్ట డం అత్యంత కీలకం. అంతేకాకుండా, నీటి వృధాను అరికట్టడానికి ఆధునిక మురుగునీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసి, ఆ రీసైకిల్ చేసిన నీటిని ఫ్లషింగ్,గార్డెనింగ్ వంటి ఇతరఅవసరాలకు విధిగా ఉపయోగించేలాఅంతర్గత ప్లాంట్‌లను డిజైన్‌చేయాల్సిన బాధ్యత బిల్డర్లపై ఉంటుంది. ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు కూడా భారీ హైరైజ్ నిర్మాణా లకు అనుమతులు ఇచ్చేముందే, ఆప్రాంతానికి సమీపంలో తాగునీటి లభ్యత, సరఫరా సామర్థ్యం ఎంత ఉందనే దానిపై సమగ్ర అంచనా వేయాలి. తగిన మౌలిక వసతులు, తాగునీటి గ్రిడ్ కనెక్షన్లు కల్పించిన తర్వాతే భారీ భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు జారీచేయాలి. లేనిపక్ష ంలో, అపార్ట్‌మెంట్ల సంస్కృతి పెరిగినప్పటికీ కనీస తాగునీరు కూడా దొరకనిదుస్థితిఏర్పడి, రేపు భవిష్యత్తులోనగరాలు తీవ్రమైననీటి యుద్ధా లను ఎదుర్కోవాల్సి వస్తుందని నిపుణులు గట్టిగా హెచ్చరిస్తున్నారు.

# ఎగువ మానేరు 9వ ప్యాకేజీ పనులు పూర్తి చేయాలి



**సుమారు లక్ష ఎకరాలకు శాశ్వత సాగునీరు అందించాలి**
**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎగువ మానేరు ప్రాజెక్టు పరిరక్షణ సమితి వినతి**
**మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం**

రాజన్న సిరిసిల్ల జిల్లా, మరో సంచలనం (అక్టోబర్ 1): ఎగువ మానేరు 9వ ప్యాకేజీ పనులను వెంటనే చేపట్టి పూర్తి చేయడంతో సుమారు లక్ష ఎకరాలకు శాశ్వత సాగునీరు అందించాలని ఎగువ మానేరు ప్రాజెక్టు పరిరక్షణ సమితి కోరింది. ఈ మేరకు సమితి ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ప్రాణహిత--చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఈ ప్రాంతానికి సాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారని సమితి పేర్కొంది. అనంతరం ప్రాజెక్టు రూపకల్పనలో మార్పులు చోటుచేసుకుని కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో వివిధ ప్యాకేజీలుగా పనులు కొనసాగాయని తెలిపింది. అయితే ఎగువ మానేరు ప్రాంతానికి అత్యంత కీలకమైన 9వ ప్యాకేజీ పనులు పూర్తిస్థాయిలో ముందుకు సాగకపోవడంతో సిరిసిల్ల ప్రాంత రైతులు సాగునీటి కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొంది. 9వ ప్యాకేజీ పూర్తయితే సుమారు లక్ష ఎకరాల సాగుభూమికి శాశ్వతంగా నీటి ప్రయోజనం కలిగే అవకాశం ఉందని వివరించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిరిసిల్ల ప్రాంత పర్యటన సందర్భంగా ఎగువ మానేరు ప్రాజెక్టును స్వయంగా పరిశీలించి, 9వ ప్యాకేజీ పనులకు అవసరమైన నిధులు మంజూరు చేసి నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేయించాలని విజ్ఞప్తి చేసింది. తన చేతుల మీదుగా పనులను ప్రారంభిస్తే రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొంది. అదేవిధంగా ఎగువ మానేరు కుడి,ఎడమ కాలువల పరిస్థితిని పరిశీలించి దెబ్బతిన్న లైనింగ్ పనులను పునరుద్ధరించాలని కోరింది. నీటి వృధాను అరికట్టి అందుబాటులో ఉన్న నీటిని రైతుల పొలాలకు సమర్థవంతంగా అందించేలా కాలువ వ్యవస్థను ఆధునీకరించాలని సూచించింది. పర్యాటకంగా అభివృద్ధి చేయాలి. ఎగువ మానేరు కేవలం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాకుండా ప్రకృతి అందాలతో కూడిన ప్రాంతమని సమితి పేర్కొంది. రిజర్వాయర్ పరిసరాలను సుందరీకరించి పర్యాటక సదుపాయాలను అభివృద్ధి చేయాలని కోరింది. వ్యూ పాయింట్లు,వాకింగ్ ప్రాంతాలు,అవసరమైన చోట్ల బోటింగ్ తదితర సౌకర్యాలను పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసింది. దీంతో వ్యవసాయాభివృద్ధితో పాటు పర్యాటక రంగం అభివృద్ధి చెంది స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపింది. ఈ ప్రాంత రైతుల సాగునీటి సమస్యలను దృష్టిలో ఉంచుకుని 9వ ప్యాకేజీ పనులకు నిధులు మంజూరు చేసి వేగవంతం చేయడానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని ఎగువ మానేరు ప్రాజెక్టు పరిరక్షణ సమితి ప్రతినిధి,మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం ముఖ్యమంత్రిని కోరారు.

# ఆ నలుగురిని లేపాశారు...నాలుగేళ్ల వేట.. ఒక్కొక్కరిగా హతం

**వైరల్ ఫొటోలోని నలుగురు ఉగ్రవాదుల కథ సమాప్తం**

ముంబై అక్టోబరు 1: జమ్మూకశ్మీర్‌లో భద్రతా దళాలు భారీ విజయాన్ని నమోదు చేశాయి. లష్కరే తోయిబా (ఎల్‌ఈటీ) సంస్థకు చెందిన సీనియర్ కమాండర్ మూసా అలియాస్ ఆసిఫ్ ఫౌజీని మంగళవారం బుద్గాం జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మట్టుబెట్టాయి. పహల్గాం ఉగ్రదాడి తర్వాత సోషల్ మీడియాలో వైరల్ అయిన ఒక ఫొటోలోని నలుగురు కీలక కమాండర్ల ముఠాలో మూసా చివరివాడు. తాజా ఎన్‌కౌంటర్‌తో ఆ నలుగురు ఉగ్రవాదుల ఏరివేత పూర్తయినట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. బుద్గాం జిల్లాలోని ఖాన్‌సాహిబ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గురువత్‌కలాన్ ప్రాంతంలో మూసా కదలికలపై భద్రతా దళాలకు పక్కా గూఢచార సమాచారం అందింది. దీంతో టెక్నికల్, హ్యూమన్ ఇంటెలిజెన్స్ ఆధారంగా జమ్మూకశ్మీర్ పోలీసులు, భద్రతా దళాలు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టాయి. ఈ ఆపరేషన్‌లో మూసా హతమైనట్లు అధికారులు ధ్రువీకరించారు. చాలాకాలంగా అతని కోసం గాలిస్తున్న భద్రతా దళాలు, ఎట్టకేలకు అతడిని మట్టుబెట్టాయి. 2022 నుంచి కశ్మీర్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న ఈ నలుగురు కమాండర్లు అనేక హింసాత్మక ఘటనలకు పాల్పడ్డారు. 2025 ఏప్రిల్‌లో జరిగిన పహల్గాం దాడి తర్వాత, ఈ నలుగురు కంబాట్ దుస్తుల్లో కలిసి ఉన్న ఫొటో ఒకటి బయటకు వచ్చి వైరల్ అయింది. అప్పటి నుంచి వీరిపై భద్రతా దళాలు ప్రత్యేకంగా దృష్టి సారించాయి. ఈ ముఠాలోని మొదటి ఉగ్రవాది కుల్గాంకు చెందిన లష్కరే కమాండర్ జునైద్ భట్‌ను 2024 డిసెంబర్ 3న శ్రీనగర్‌లోని దాచిగామ్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమార్చారు. ఏడుగురి మృతికి కారణమైన గగన్‌గీర్ దాడిలో ఇతను కీలక సూత్రధారి. రెండో ఉగ్రవాది సులేమాన్‌ను భద్రతా దళాలు 2025 జులై 28న 'ఆపరేషన్ మహాదేవ్' పేరుతో చేపట్టిన ఆపరేషన్‌లో మట్టుబెట్టాయి. వైరల్ ఫొటోలో ఉన్న సులేమాన్, పహల్గాం దాడిలో పాల్గొన్నట్లు దర్యాప్తులో తేలింది. మూడో ఉగ్రవాది, పాకిస్థానీ జాతీయుడైన యాసిర్‌ను 2026 సెప్టెంబర్ 4న బుద్గాంలో జరిగిన 'ఆపరేషన్ అఫ్జర్'లో హతమార్చారు.

# ఆస్తులపై విచారణకు సిద్ధమా?

మొదటిపేజీ తరువాయి...

అమెరికాలో ఎవరి పనులు వారే చేసుకుంటారు. బాత్‌రూమ్‌లు కడుక్కుంటే తప్పా? నేను అఫిడవిట్‌లో పెట్టిన సమాచారాన్నే.. నిన్న రేవంత్‌రెడ్డి చెప్పారు. మా నాన్న చదివించారు.. చదువుకున్నా.. రేవంత్‌రెడ్డికి చదువు రాలేదు. ఎవరైనా డిగ్రీ మూడేళ్లు చదువుతారు.. రేవంత్‌రెడ్డి 8 ఏళ్లు చదివారు" అని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

# లక్షలాది యువత ఆకాంక్షలకు ప్రతీక యూపీఎస్సీ

మొదటిపేజీ తరువాయి...

స్మిత్ ఘనత మనందరికీ గర్వకారణమని, తాను ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడానని తెలిపారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న స్మిత్ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని దేశ ప్రజలందరూ ప్రార్థించాలని పిలుపునిచ్చారు. యూపీఎస్సీ వందేళ్ల ప్రస్థానంపై మోదీ మాట్లాడుతూ.. "ఇది కేవలం ఒక సంస్థ వందేళ్లు పూర్తి చేసుకోవడం కాదు, ఇది లక్షలాది యువత ఆశయాల వేడుక. ప్రతి భారతీయుడు ఈ సంస్థపై ఉంచిన అచంచల విశ్వాసానికి ఇది నిలువుటద్దం. ఈ సంస్థను ఉన్నత శిఖరాలకు చేర్చిన ప్రతి ఒక్కరికీ నా అభినందనలు" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సివిల్ సర్వీసుల చరిత్రను, మహనీయుల సేవలను మోదీ గుర్తుచేసుకున్నారు. "1920లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఈ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. ఆనాడు బ్రిటిష్ పాలన ఉన్నప్పటికీ ఆయన సంస్కృతంలో పేపర్ రాశారని ఇక్కడి గ్యాలరీలో చూశాను. అదేవిధంగా, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశాన్ని నడపడంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారు. స్వతంత్ర భారతానికి అవసరమైన 'ఉక్కు చట్రాన్ని' (స్టీల్ ఫ్రేమ్) సర్దార్ పటేల్ అందించారు. ఈ సంస్థను దేశానికి ఒక ప్రధాన



స్తంభంగా తీర్చిదిద్దారు" అని మోదీ వివరించారు. 1926 అక్టోబర్ 1న పబ్లిక్ సర్వీస్ కమిషన్‌గా ప్రారంభమైన ఈ సంస్థ, శతాబ్ద కాలంలో ఎన్నో మార్పులకు లోనై స్వతంత్ర రాజ్యాంగబద్ధ సంస్థగా రూపుదిద్దుకుందని ప్రధాని గుర్తుచేశారు. గతేడాది అక్టోబర్ 1న ప్రారంభమైన శతాబ్ది ఉత్సవాలు ఈ కార్యక్రమంతో ముగిశాయి. సెప్టెంబర్ 30, అక్టోబర్ 1 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగిన ఈ వేడుకల్లో వివిధ రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్మన్లు, సభ్యులు, కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారులు, విద్యావేత్తలు, యూపీఎస్సీ అధికారులు పాల్గొన్నారు.

# మమతా వర్గానికి సుప్రీంలో చుక్కెదురు

మొదటిపేజీ తరువాయి...

డిల్లీ: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ వర్గానికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. స్తంభింపజేసిన నాలుగు బ్యాంకు ఖాతాలను వినియోగించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం గురువారం తోసిపుచ్చింది. ఈ ఖాతాల్లో సుమారు రూ. 804 కోట్ల మేర నిధులు ఉన్నట్లు సమాచారం. జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ పి.బి. వరాలేలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. కలకత్తా హైకోర్టు గతంలో జారీ చేసిన ఉత్తర్వులలో జోక్యం చేసుకునేందుకు ధర్మాసనం నిరాకరించింది. పార్టీలో నెలకొన్న వర్గపోరు కారణంగా కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే పార్టీ గుర్తును స్తంభింపజేసిందని, ఈ నేపథ్యంలో సదరు నిధులు యాజమాన్య హక్కులపై స్పష్టత రావాల్సి ఉందని కోర్టు అభిప్రాయపడింది. ఈ దశలో నిధుల వినియోగంపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేమని స్పష్టం చేస్తూ, కేసు విచారణను వేగవంతం చేయాలని కలకత్తా హైకోర్టును ఆదేశించింది. ఆర్థిక అవకతవకల ఆరోపణలు, పలు ఎఫ్‌ఐఆర్‌ల నమోదు నేపథ్యంలో పశ్చిమ బెంగాల్ పోలీసులు ఈ నాలుగు ఖాతాలను స్తంభింపజేశారు. దీనిపై మమతా వర్గం కలకత్తా హైకోర్టును ఆశ్రయించగా, ఆగస్టు 27న వారికి ఎటువంటి మధ్యంతర ఊరట లభించలేదు. అయితే, రోజువారీ పార్టీ నిర్వహణ ఖర్చుల కోసం కోర్టు నియమించిన ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో ఇతర ఖాతాలను పరిమితంగా వినియోగించుకోవడానికి హైకోర్టు అనుమతినిచ్చింది. ఖాతాల స్తంభనతో పార్టీ కార్యకలాపాలు నిలిచిపోతున్నాయని మమతా వర్గం వాదించినప్పటికీ, సుప్రీంకోర్టు మాత్రం హైకోర్టు నిర్ణయాన్నే సమర్థించింది.

# నిజాంలు నీళ్లు తాగిన బావికి హైడ్రా పునరుజ్జీవం

మొదటిపేజీ తరువాయి...

నిజాం నవాబులు సైతం ఔషధ గుణాలున్నాయని భావించి ఈ బావి నీరు తాగినట్టు చరిత్ర చెబుతోంది. అంతటి విశిష్టత కలిగిన ఈ బావి, కాలగర్భంలో కలిసిపోతున్న తరుణంలో హైడ్రా దీని పునరుద్ధరణకు శ్రీకారం చుట్టింది.

సీఎం ఆదేశాలతో వేగంగా అడుగులు: గత మార్చి 8వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువును ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఆ సమయంలోనే చెరువుకు ఆనుకుని ఉన్న ఈ చారిత్రక బావి ప్రాముఖ్యతను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీని చారిత్రక నేపథ్యాన్ని తెలుసుకున్న ముఖ్యమంత్రి, తక్షణమే బావిని పునరుద్ధరించాలని ఆదేశించారు. దీంతో హైడ్రా అధికారులు రంగంలోకి దిగారు. చెరువు అభివృద్ధి పనులను విజయవంతంగా పర్యవేక్షించిన 'విమోస్ టెక్నోక్రాట్స్' సంస్థకే ఈ బావి పునర్నిర్మాణ బాధ్యతలను కూడా అప్పగించారు. ప్రస్తుతం పనులు శరవేగంగా జరుగుతుండగా, మరో రెండు, మూడు నెలల్లో ఈ బావి పూర్వ వైభవాన్ని సంతరించుకోనుంది. ఘనమైన చరిత్ర.. మరుగునపడిన వైభవం: ఒకప్పుడు వంద ఎకరాల్లో విస్తరించిన బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువు, కాలక్రమేణా కబ్జాలకు గురై కేవలం 4 ఎకరాలకు పరిమితమైంది. దీనిపై దృష్టి సారించిన హైడ్రా, హెచ్ఎండీఏ లెక్కల ప్రకారం 17 ఎకరాల భూమిని ఆక్రమణల నుంచి విడిపించి చెరువుకు జీవం పోసింది. ఈ చెరువు కింద



1.50 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఊట బావికి కూడా అంతే ఘనమైన చరిత్ర ఉంది. మూడవ నిజాం సికందర్ జా పాలనలో (సుమారు 1770) ప్రధానమంత్రిగా ఉన్న నవాబ్ రుక్న్-ఉద్-దౌలా పేరు మీదుగా ఈ చెరువును నిర్మించినట్లు చారిత్రక ఆధారాలున్నాయి.

చెరువు పరిసరాల్లోని ఔషధ మొక్కల వేర్ల నుంచి ప్రవహించే నీరు, సహజ సిద్ధంగా వడపోతకు గురై ఈ బావిలోకి చేరేదని, అందువల్ల ఈ నీటికి అద్భుతమైన ఔషధ గుణాలుండేవని చరిత్రకారులు చెబుతారు. ఈ స్వచ్ఛమైన నీటిని నిజాం పాలకులు తాగేవారని, ఎడ్ల బండ్లపై సుదూర ప్రాంతాలకు, చివరకు లండన్‌కు కూడా తరలించినట్లు కథలు ప్రచారంలో ఉన్నాయి. కానీ కాలక్రమేణా ఈ బావి ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త, మట్టితో నిండిపోయి తన నీటి నిల్వ సామర్థ్యాన్ని పూర్తిగా కోల్పోయింది.

వారసత్వ సంపద పరిరక్షణే లక్ష్యం: హైడ్రా ఈ బావి పునరుద్ధరణను కేవలం ఒక కట్టడాన్ని బాగుచేయడంగా కాకుండా వారసత్వ పరిరక్షణ, పర్యావరణ అభివృద్ధి, ప్రజా ప్రయోజనం అనే మూడు అంశాల సమన్వయంగా భావిస్తోంది. నిర్లక్ష్యానికి గురైన ఈ చారిత్రక సంపదను తిరిగి ప్రజలకు అందించి, భవిష్యత్ తరాలకు నగర జల నిర్వహణ పద్ధతులపై అవగాహన కల్పించడమే తమ లక్ష్యమని హైడ్రా అధికారులు తెలిపారు. బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువు, దాని కింద ఉన్న ఔషధ గుణాల బావి.. ఇవి హైదరాబాద్‌లోని ప్రకృతి ఆధారిత వైద్య విధానాలకు, నీటి సంరక్షణ జ్ఞానానికి నిలువెత్తు సాక్ష్యాలు. ఈ పునరుద్ధరణతో ఆనాటి వైభవాన్ని కళ్లకు కట్టినట్లు చూపించే ప్రయత్నం జరుగుతోంది.

# బీఆర్ఎస్‌తో పొత్తుపై కిషన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి...

బీజేపీని గెలిపించాలని ఖైరతాబాద్ ప్రజలు ఇప్పటికే మెంటల్‌గా ప్రిపేరైపోయారు. కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి ప్రజల తీర్పును కాలరాసింద"ని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

రేవంత్.. సోనియా బానిస: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కిషన్‌రెడ్డి విమర్శలు చేశారు. తెలంగాణ ప్రజల ఆశీస్సులతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి.. సోనియా గాంధీ కుటుంబానికి బానిసగా ఉంటానని చెప్పడాన్ని ఆక్షేపించారు. 'రేవంత్.. ఢిల్లీలో సోనియా కుటుంబానికి బానిస. హైదరాబాద్‌లో మజ్లిస్ కుటుంబానికి బానిస' అని వ్యాఖ్యానించారు. మహిళల రిజర్వేషన్లు, పార్లమెంట్ సీట్ల పెంపు విషయంలో రేవంత్‌రెడ్డి అబద్ధాలు చెబుతున్నారని ధ్వజమెత్తారు. సీట్ల పెంపు విషయంలో అబద్ధాలతో విషం చిమ్ముతూ, ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉండి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు.

రేవంత్ వ్యాఖ్యలను ఖండిస్తున్నా: రేవంత్‌రెడ్డి తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి సనాతన ధర్మం, రాజ్యాంగబద్ధ సంస్థలపై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా.. మతం, దేవుడి పేరుతో ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. రోజుకో కొత్త అంశాన్ని తెర మీదకు తెచ్చి నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. ప్రజలను అన్ని రకాలుగా విభజించే అలవాటు కాంగ్రెస్ పార్టీకి ఎప్పటి నుంచో ఉందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# భారత పైలట్ స్మిత్ మచ్చర్ కుటుంబానికి మోదీ ఫోన్

మొదటిపేజీ తరువాయి...

తీవ్ర గాయాలపాలైనప్పటికీ, స్మిత్ ధైర్యం కోల్పోకుండా కాక్‌పిట్ డోర్‌ను తెరిచారు. దీంతో ప్రయాణికులు వెంటనే స్పందించి, లోపలికి ప్రవేశించి దాడి చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. స్మిత్ సమయస్ఫూర్తి వల్ల విమానంలోని 174 మంది ప్రయాణికులకు పెను ప్రమాదం తప్పింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం, ప్రధాని మోదీ నేరుగా స్మిత్ భార్య, తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడారు. గాయపడిన పైలట్‌కు భారత రాయబార కార్యాలయాల ద్వారా అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అయితే, సహ పైలట్ దాడికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. అధికారులు ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

R. HINDUSTAN
రిపబ్లిక్ హిందుస్థాన్

# మేడిగడ్డ పనులు మొదలు ఇక



కరీంనగర్ : తెలంగాణలో కొంతకాలంగా రగిలిపోతున్న ప్రధాన అంశాలలో మేడిగడ్డ ఒకటి. కాళేశ్వరం ప్రాజెక్టులోని ప్రధాన బ్యారేజీలలో మేడిగడ్డ ఒకటి. అయితే ఇది కుంగిపోవడంతో రాజకీయ వివాదానికి దారితీసింది. బీఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ ప్రాజెక్టు వైఫల్యాలపై కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దర్యాప్తునకు ఆదేశించింది. అయితే మేడిగడ్డను పునరుద్ధరించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే జాప్యం చేస్తోందని, కేవలం బీఆర్ఎస్ పార్టీని రాజకీయంగా బద్నాం చేయడమే ధ్యేయంగా రేవంత్ రెడ్డి సర్కార్ వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తూ వచ్చారు. ఈ విమర్శలకు చెక్ పెడుతూ ఎట్టకేలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం మేడిగడ్డ బ్యారేజ్ పునరుద్ధరణ దిశగా కీలక అడుగులు వేసింది.మేడిగడ్డ కుంగుబాటు కేవలం ఇంజనీరింగ్ వైఫల్యమా లేక రాజకీయ కుట్రల ఫలితమా అనే చర్చ గత రెండేళ్లుగా తెలంగాణ రాజకీయాలను కుదిపేస్తోంది. బ్యారేజ్ కుంగిన వెంటనే ప్రతిపక్ష బీఆర్ఎస్ దీనిని కేవలం సాంకేతిక లోపంగా, ప్రకృతి విపత్తుగా అభివర్ణించింది. అధికార కాంగ్రెస్ పార్టీ మాత్రం దీనిని అవినీతి కట్టడంగా విమర్శించింది. బ్యారేజ్‌ను బాగుచేయకపోతే రాష్ట్రానికి తాగు, సాగునీటి కష్టాలు తప్పవంటూ ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఒత్తిడి తెచ్చింది. అయినా ప్రాజెక్టు పునరుద్ధరణపై ఇన్నాళ్లూ కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. అయితే ఇప్పుడు పునరుద్ధరణ పనులకు నడుం బిగించింది.నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సిఫార్సులు, ఐఐటీ బాంబే నిపుణులు, అంతర్జాతీయ కన్సల్టెన్సీల సాంకేతిక నివేదికల ఆధారంగా ప్రభుత్వం మేడిగడ్డతో పాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజ్‌లకు కూడా సమగ్ర పునరుద్ధరణ ప్రణాళికలను సిద్ధం చేసింది. బ్యారేజ్ మొత్తం వెడల్పు మేరకు ఎండ్ టు ఎండ్ డయాఫ్రమ్ వాల్ నిర్మించి, పునాది భద్రతను పటిష్టం చేయాలని నిర్ణయించారు. అంతేకాకుండా వరద ఉధృతిని నియంత్రించడానికి దిగువన ఉన్న స్టిల్లింగ్ బేసిన్‌లను బలోపేతం చేయనున్నారు. ఈ పనులను రాబోయే వర్షాకాలం లోపే.. అంటే 2027 జూన్ నాటికి పూర్తి చేయాలని రేవంత్ సర్కార్ నిర్ణయించింది. దెబ్బతిన్న నిర్మాణాలను పునరుద్ధరించడం సాంకేతికం గా క్లిష్టమైనప్పటికీ, రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా వెనుకంజ వేయబోమని ప్రభుత్వం స్పష్టం చేసింది.ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం వెనుక బలమైన రాజకీయ వ్యూహం ఉంది. మేడిగడ్డను వదిలేశారు.. రాష్ట్ర ప్రయోజనాలను పట్టించుకోవట్లేదు.. అనే బీఆర్ఎస్ విమర్శలకు ప్రభుత్వ నిర్ణయం గట్టి సమాధానం ఇస్తుంది. ప్రాజెక్టుల పునరుద్ధరణకు తాము వ్యతిరేకం కాదని, కేవలం అవినీతి బండారాన్ని బట్టబయలు చేయడమే తమ ఉద్దేశమని చాటిచెప్పినట్లయింది. ప్రజలకు ఉపయో గపడేలా శాశ్వత పరిష్కారాలు చూపుతున్నామని నిరూపించుకునేందుకు కాంగ్రెస్ పార్టీకి ఇది గొప్ప అవకాశంగా మారింది. రాజకీయ లబ్ధి కోసం కాలయాపన చేస్తున్నారన్న అపవాదును తొలగించుకోవడంలో రేవంత్ రెడ్డి సర్కార్ సఫలమైందనే చెప్పాలి

## మన నిర్మల్ లో అంగరంగ వైభవంగా ప్రారంభమైన

# సిబియస్ చందన బ్రదర్స్ షాపింగ్ మాల్

**తెలంగాణలో 7వ షోరూం అక్టోబర్ 1 నుండి 5వరకు అదిరిపోయే ఆఫర్స్**

**సందడి చేసిన సినీనటి అందాల తార ఐశ్వర్య రాజేష్**





నిర్మల్ మరో సంచలనం (అక్టోబర్ 1): నిర్మల్ ప్రజలు ఎప్పుడు ఎప్పుడు అని ఎదురుచూస్తున్న సిబియస్ (చందన బ్రదర్స్ షాపింగ్ మాల్) ప్రారంభోత్సవం జన సందోహంతో ఘనంగా జరిగింది.ప్రముఖ సినీనటి ఐశ్వర్య రాజేష్ ప్రారంభించారు.అందరికి అందుబాటు ధరలలో వన్ స్టాప్ మాల్ సిబియస్ (చందన బ్రదర్స్ షాపింగ్ మాల్) నిర్మల్,బోయివాడ,నటరాజ్ నగర్ లో ప్రారంభించబడం ఎంతో సంతోషదాయకమని అన్నారు.షోరూం మేనేజింగ్ డైరెక్టరు జానా సురేష్ మాట్లాడుతూ 40 సంవత్సరాల అనుబంధ సంస్థ తెలుగు రాష్ట్రాలలో ప్రారంభించిన ప్రతి చోటా అతి తక్కువ కాలంలోనే అక్కడి ప్రజల మన్ననలతో నెం.1 షోరూంగా నిలుస్తుండడం తమకు ఎంతో ఉత్సాహాన్ని,మరిన్ని ప్రదేశాలలో ప్రారంభించాలనే ప్రోత్సాహాన్ని అందిస్తుందని,నిర్మల్ విషయంలోనైతే షోరూం తీర్చిదిద్దడంలో గాని,ఇక్కడి ప్రజల అభిరుచికి సరిపడే వస్త్రాలు ఎంపిక చేయడంలోగాని ప్రత్యేక శ్రద్ధ పెట్టడంవలన ఇక్కడి కస్టమర్ల అభిమానాన్ని మరింత వేగంగా పొందుతామనడంలో తమకు అపారమైన నమ్మకంమందని తెలియజేసారు.అన్ని ఆదాయ వర్గాలకూ అందుబాటు ధరలలో నాణ్యమైన సంప్రదాయ వస్త్రాలనూ అలానే మోడ్రన్ ఫ్యాషన్లనందించ డంలో మరింత ముందుంటామని అదే తమ విజయరహస్యమని తెలియజేసారు.ప్రారంభోత్సవ మరియు దసరా,దీపావళి వేడుకల సందర్భంగా అన్ని రకాల వస్త్రాలపై తగ్గింపు ధరల తో మా కస్టమర్స్ కి అందుస్తున్నాము అని అన్నారు.ప్రముఖ సినీనటి ఐశ్వర్య రాజేష్ మాట్లాడుతూ తాము సిబియస్ (చందన బ్రదర్స్ షాపింగ్ మాల్) ప్రారంభోత్సవంలో భాగం కావడం ఎంతో సంతోషకరమని,ఎందుకంటే నిర్మల్ లో ప్రతి చిన్న అవసరానికి,అది ఇంట్లో ఏ ఫంక్షన్లకైనా,షూటింగ్ కాస్ట్యూంలకైనా తాము మొదటిగా వెళ్ళేది సిబియస్ (చందన బ్రదర్స్ షాపింగ్ మాల్) కేనని,ఇక్కడ లభించే డిజైన్లూ-వెరైటీలూ వేరెక్కడా లభించవని,అందుకే ఇది హైదరాబాదీల ఫేవరిట్ షోరూంగా మారిందని అన్నారు.ఇక మొదటిగా తామే షాపింగ్ చేయాలని వచ్చిన కస్టమర్ల ఆనందానికైతే హద్దేలేకుండా పోయింది ముఖ్యంగా స్త్రీల సంతోషం పట్టనలవికాకుండా ఉంది.ప్రారంభోత్సవ ఆఫర్లతో అతి తక్కువ ధరలతో ఉన్న చీరలను చూసి మురిసిపోతూ షాపింగ్ బుట్టలలో చీరలను నింపేయడం ప్రతి ఫ్లోర్లోనూ కనిపించింది.

# లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో 23 కిలోల గంజాయి పట్టివేత



కొండాపూర్, అక్టోబర్ 1 : లింగంపల్లి రైల్వే స్టేషన్ వద్ద డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫో ర్స్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో భారీగా గంజాయి పట్టుబడింది. అనుమానాస్పదంగాఇద్దరు వ్యక్తులనుతనిఖీ చేయగా వారి వద్ద సుమారు 23 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.గంజాయితో పట్టుబడి న వారు ముంబైకి చెందిన రహ్మతుల్లా ఖాన్, రషీద్ లుగా గుర్తించారు. కాగా, వీరు ఒడిశాలో గంజాయికొనుగోలు చేసి హైదరాబాద్‌కు అక్ర మంగా తరలిస్తున్నట్లు విచారణలో తెలిసినట్లు టాస్క్ ఫోర్స్ అధికారులు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి తదుపరి విచారణ నిమిత్తం శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

## పెంచిన స్విమ్మింగ్

# పూల్ ఫీజు తగ్గించాలి

## ప్లకార్డులతో స్విమ్మర్ల నిరసన



హనుమకొండ , అక్టోబర్ 1: హనుమకొండ బాలసముద్రంలోని స్విమ్మింగ్ పూల్ వద్ద స్విమ్మర్లు ఆందోళనకు దిగారు. స్విమ్మింగ్ పూల్ నెలసరి రుసుమును విపరీతంగా పెంచడంతో ఇబ్బందులు పడుతున్నామంటూ స్విమ్మర్లు ప్లకార్డులతో గురువారం నిరసన తెలిపారు. శాంతియుతంగా నిరసన తెలియజేస్తుంటే ఇన్చార్జి డిఎస్ఓ కొత్త ప్రశాంత్ వెంటనే పోలీసులకు సమాచారం అందించడంపై మండిపడ్డారు. గతంలో స్విమ్మింగ్ పూల్ నిండుగా కలకలలాడుతూ ఎంతోమంది స్విమ్మింగ్ చేసేవారు. అయితే స్విమ్మింగ్ పూల్ మరమ్మతు పేరుతో సంవత్సరనరపాటు నిలిపివేశారు. మరమ్మతుల అనంతరం స్విమ్మింగ్ చేయడానికి చెల్లించాల్సిన రుసుమును విపరీతంగా పెంచడంతో చాలామంది తగ్గిపోయారు. ఇప్పటికైనా అధికారులు దీనిని దృష్టిలో ఉంచుకొని రుసుమును తగ్గిస్తే బాగుంటుందని స్విమ్మర్లు డిమాండ్ చేస్తున్నారు. గతంలో ఎంతోమంది పోటీలకు వెళ్లి కూడా ఇక్కడి నుండి బహుమతులు గెలుచుకున్నారు. కానీ ఇప్పుడు అది పేదవారికి అందని ద్రాక్షగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రేట్లు తగ్గించాలని డిమాండ్

# స్పోర్ట్స్ స్కూల్లో చెత్తాచెదారం

## రోగాల బారిన విద్యార్థులు, మండిపడుతున్న తల్లిదండ్రులు



హనుమకొండ అక్టోబర్ 1: కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం.. పట్టించుకోని అధికారుల తీరు విద్యార్థులకు శాపంగా మారింది. పచ్చని, ఆహ్లాదకర మైన వాతావరణంలో విద్యనాభ్యసించాల్సిన విద్యార్థులు పేరుకుపోయిన చెత్త చెదారంతో సావాసం చేస్తున్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాల్సిన విద్యార్థులు రోగాల బారిన ఇంటికెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులపై తల్లిదండ్రులు మండిపడుతున్నారు. తమ పిల్లలు ఇలాంటి వాతావరణంలో ఉండాల్సి రావడం బాధాకరమని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తూతూమంత్రంగా ఉత్తుత్తి స్పోర్ట్స్ స్కూల్: కాంగ్రెస్ ప్రభుత్వం తూతూమంత్రంగా ఉత్తుత్తి స్పోర్ట్స్ స్కూల్ హనుమకొండ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ప్రారంభించారు. ఇంకా ఇప్పటివరకు ఎలాంటి జీవో ప్రకటించలేదు.అరకొర వసతులు సమకూర్చి నెట్టుకొస్తు న్నారు. రెండేళ్లుగా విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. స్పోర్ట్స్ పాఠశాలలో పారిశుధ్య పరిస్థితులు ఆందోళనకరంగా మారాయి. పాఠశాల పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోయి అపరిశుభ్ర వాతావరణం కనిపిస్తోంది. దీంతో పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినీ, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులకు క్రీడలతో పాటు నాణ్యమైన విద్య, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాల్సిన పాఠశాల ఆవరణలోనే చెత్త పేరుకుపోవడం పట్ల తల్లిదండ్రులుఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టించుకోని అధికారులు..: చెత్త కారణంగా దోమలు, ఈగలు వృద్ధి చెందడంతోపాటు దుర్వాసన వస్తోందని చెబుతున్నారు. అపరిశుభ్రత కారణంగా విద్యార్థులు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు ప్రజాప్రతినిధులు ఎటువైపు కన్నెత్తి చూడడం లేదని తల్లిదండ్రులు మండిపడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పాఠశాల ఆవరణలో పేరుకుపోయిన చెత్తను తొలగించి, క్రమం తప్పకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని స్పోర్ట్స్ పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు శాశ్వత చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# తల్లులకు పౌష్టికాహార ప్రాముఖ్యతపై అవగాహన





కారేపల్లి, అక్టోబర్ 01 : సింగరేణి మండలంలోని ఉసిరికాయపల్లి గ్రామ పంచాయతీ గొల్లగూడెం-2 అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం 9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఐసిడిఎస్ కామేపల్లి ప్రాజెక్టు సిడిపీఓ కె.ఉమా ముఖ్య అతిథిగా పాల్గొని తల్లులకు పౌష్టికాహారం ప్రాముఖ్యతను వివరించారు. చిన్నారుల ఎదుగుదల, ఆరోగ్యకరమైన జీవనానికి పోషక విలువలతో కూడిన సమతుల ఆహారం ఎంతో అవసరమని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో వివిధ రకాల పోషకాహార పదార్థాలతో ఫుడ్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. స్థానికంగా లభించే ఆకుకూరలు, కూరగాయలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు తదితర ఆహార పదార్థాల ద్వారా సమతుల పోషకాహారం పొందే విధానాన్ని తల్లులకు వివరించారు. చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పోషకాహార సేవలను సద్వినియోగం చేసుకోవాలని సిడిపీఓ సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ పంచాయతీ సర్పంచ్ వరలక్ష్మి, ఉప సర్పంచ్, సూపర్ వైజర్ సత్యశీల, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

# సర్వే ప్రక్రియను పారదర్శకంగా ఖచ్చితత్వంతో నిర్వహించాలి

కోహెడ : జిల్లాలో భూ భారతి రీ సర్వే ప్రక్రియను పారదర్శకంగా ఖచ్చితత్వంతో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. గురువారం కోహెడ మండల పరిధిలోని జువ్వా తండా లో నిర్వహించిన భూభారతి రీ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ కె హైమావతి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. దాదాపు 90 సంవత్సరాల క్రితం భూ సర్వే నిర్వహించారని మారుతున్న కాలంతో పాటు పెరిగిన జనాభా వలన భూమి కొరత కారణంగా భూ సమస్యలు అధికంగా తలెత్తాయని, ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి - రీ సర్వే ను నిర్వహిస్తుందని తెలిపారు. రీ-సర్వే సమయంలో భూమి విస్తీర్ణం, సర్వే నంబర్లు, హద్దులు, పట్టా వివరాలు తదితర అంశాలను సంబంధిత రికార్డులతో సరిపోల్చి నమోదు చేయాలని తెలిపారు. సర్వే ప్రక్రియలో రైతులు, భూ హక్కుదారుల సహకారం తీసుకోవాలని అధికారులకు సూచించారు. నిర్ణీత గడువులో పూర్తి చేసి, భూ రికార్డులను పకడ్బందీగా నవీకరించాలని కలెక్టర్ ఆదేశించారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముందుగా గ్రామ సరిహద్దు నిర్దేశించి, ప్రభుత్వం స్థలాలలో సర్వే చేయాలని, తర్వాత పట్టా, అసైన్డ్ భూములను సర్వే చేయాలని సర్వే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఎస్. నవీన్ కుమార్, అర్ఐ, సర్వే అధికారులు, గ్రామ సర్పంచ్, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# భూముల రీసర్వేకు రైతులు సహకరించాలి

## కాల్వశ్రీరాంపూర్ తహసీల్దార్



కాల్వశ్రీరాంపూర్, అక్టోబర్ 1 : గ్రామాల్లో జరుగుతున్న భూ రీసర్వే ప్రక్రియ వేగవంతంగా పూర్తి కావడానికి రైతులందరు సహకరించాలని తహసీల్దార్ రావె రాముడు కోరారు. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని మంగపేట లో భూముల రీ సర్వే కోసం గురువారం పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. ప్రతీ భూ ఖండానికి ప్రత్యేకమైన భూఆధార్ కేటాయించాలనే లక్ష్యంతో ప్రభుత్వం భూముల రీ సర్వేకు శ్రీకారం చుట్టింద అన్నారు. భూ రీసర్వే కోసం కాల్వశ్రీరాంపూర్ మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా కూనారం, మంగపేట, వెన్నంపల్లి, కిష్టంపేట, మొట్లపల్లి గ్రామాలను ఎంపిక చేసినట్లు చెప్పారు. మంగపేట లో జూలై14న తొలిసారి గ్రామ సభ నిర్వహించి, పనులు ప్రారంభించగా, గ్రామంలోని మొత్తం 1300 ఎకరాలకు గాను ఇప్పటి వరకు 80 రోజుల్లో కేవలం 600 ఎకరాలు మాత్రమే రీసర్వే పూర్తయ్యిందన్నారు. రైతులు భూ సర్వేకు ముందుకు వచ్చి సర్వే చేయించుకోవాలని సూచించారు. రైతులు సహకరిస్తే మిగతా భూమిని వేగంగా కొలిచి రికార్డులు సరి చేస్తామని, దీనివల్ల భవిష్యత్ లో రైతులకు ఎలాంటి భూ సమస్యలు తలెత్తకుండా స్పష్టమైన హక్కులు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆకుల శ్రీనివాస్‌పటేల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జీపీవో రాజు సర్వేయర్ రాజు, సంచార కార్యదర్శి రమ్య, రైతులు పాల్గొన్నారు.

# పోషక విలువలతోనే తల్లీబిడ్డ ఆరోగ్యం

## ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిహారిక



నీలగిరి, అక్టోబర్ 01 : పోషక విలువలు ఉన్న ఆహారం క్రమం తప్పకుండా తీసుకుంటే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి పౌష్టికాహారం ఎంతో కీలకమని నల్లగొండ ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నిహారిక అన్నారు. నల్లగొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మన్యం సెక్టార్ 24వ డివిజన్‌లో గురువారం పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు సమతుల్య ఆహారం అవసరమని తెలిపారు. గర్భిణీలు, బాలింతలు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడంతో పాటు ఆరోగ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రతి కుటుంబం అవగాహనతో ముందుకు రావాలని నిహారిక సూచించారు. పోషణ మాసం సందర్భంగా ప్రజల్లో పోషకాహారం, ఆరోగ్యం, పరిశుభ్రతపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ప్రమీల, ప్రేమలత, షాహిదా, ఆశా వర్కర్ సువర్ణ, ఆర్పీ అండాలు పాల్గొన్నారు.

# మందమర్రి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన రామగుండం పోలీస్ కమిషనర్

**క్యాతనపల్లి అక్టోబర్01:** రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిధిలోని మందమర్రి పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝూ తనిఖీ చేశారు.మందమర్రి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న పోలీస్ కమిషనర్‌కు మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్, మందమర్రి ఎస్ఐ నరేష్ మొక్కను అందజేసి స్వాగతం పలికారు.అనంతరం పోలీస్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించిన కమిషనర్,స్టేషన్‌ను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. రిసెప్షన్ కేంద్రం సిబ్బందితో మాట్లాడి రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో 5ఎస్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, సిబ్బంది బ్యారక్‌ను పరిశుభ్రంగా ఉంచాలని, అన్ని రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించాలని ఆదేశించారు.స్టేషన్ రైటర్, సీసీటీఎన్ఎస్ రైటర్లతో మాట్లాడి ఆన్‌లైన్‌లో వివరాల నమోదు,రికార్డుల అప్‌లోడ్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో మాట్లాడి వారి వ్యక్తిగత, శాఖాపరమైన అంశాలతో పాటు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా నమోదవుతున్న నేరాలు,పెండింగ్ కేసులు,దర్యాప్తు పురోగతి, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్ల కదలికలు,నేర నియంత్రణ చర్యలు, విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ తదితర అంశాలపై స్టేషన్ ఎస్ఐను అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్‌లోని అన్ని విభాగాల పనితీరును సమీక్షించినట్లు తెలిపారు. రిసెప్షన్ కేంద్రం పనితీరు, పెట్రోల్ వాహనాల నిర్వహణ,పెండింగ్ కేసుల పురోగతి, వివిధ విభాగాల పనితీరు, ప్రజలకు అందిస్తున్న పోలీస్ సేవలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించినట్లు పేర్కొన్నారు. మందమర్రి సింగరేణి




పారిశ్రామిక ప్రాంతం ఉండటంతో ఇక్కడ ప్రత్యేకమైన సవాళ్లు ఉన్నాయని సీపీ తెలిపారు. ముఖ్యంగా పారిశ్రామిక ప్రాంతాల్లో జరిగే దొంగతనాలను అరికట్టడంపై ప్రత్యేక దృష్టి సారించాలని స్టేషన్ అధికారులకు సూచించారు.
గతంలో కేసులు నమోదైన వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచుతూ వారి కార్యకలాపాలను ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. అవసరాన్ని బట్టి నిబంధనల ప్రకారం గ్యాంగ్ ఫైళ్లను ప్రారంభించి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మందమర్రి ప్రాంతంలో నేరాలు, మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టి నేర రహిత, మాదకద్రవ్య రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని పోలీస్ అధికారులకు సీపీ అంబర్ కిశోర్ ఝూ సూచించారు.ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన పోలీస్ సేవలు అందించేలా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ ఆదేశించారు.

# సెప్టెంబర్ మాసంలో ఉత్పత్తికీ సంబంధించిన కార్మిక సంక్షేమ కార్యక్రమాల వివరాలను వెల్లడించిన జిఎం రాధాకృష్ణ

**,క్యాతనపల్లి మందమర్రి01:** ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ మాట్లాడుతూ సెప్టెంబర్--2026 మాసానికి సంబంధించిన ఉత్పత్తి, ఉత్పాదకత కార్మిక సంక్షేమ కార్యక్రమాల వివరాలను వెల్లడించారు.గడిచిన సెప్టెంబర్ మాసంలో మందమర్రి ఏరియా 130% బొగ్గు ఉత్పత్తి సాధించడంతో పాటు 105% ఓవర్ బర్డెన్ తొలగింపు లక్ష్యాన్ని పూర్తి చేసిందని వివరించారు. అంతర్గత గనులలో ఉద్యోగుల గైర్హాజరు వలన ఉత్పత్తికి కొంత విఘాతం కలుగకుండ, ఈ సమస్యను అధిగమించడానికి యూనియన్ నాయకులతో కలిసి సమన్వయంతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు.ఓసీపీలలో పేలుడు పదార్థాల పరిమాణం, వాడే డిలే డెటోనేటర్ల సమయం ఆధారంగా పేలుడు యొక్క తీవ్రత సురక్షిత పరిమితుల్లోనే ఉండేలా మైనింగ్ ఇంజనీర్లు డిజైన్ చేస్తారు.ప్రమాదాల నివారణ పేలుడు జరిపినప్పుడు రాళ్లు మట్టి ముక్కలు గాలిలోకి ఎగిరిపడకుండా తగిన విధంగా జాగ్రత్తలు తీసుకుంటారు. ఈ పరిధి గరిష్టంగా 300 మీటర్ల లోపే పరిమితమయ్యేలా చర్యలు ఉంటాయన్నారు.గని కార్మికుల ప్రాణరక్షణే ప్రథమ కర్తవ్యం భూగర్భ గనుల్లో సురక్షిత బ్లాస్టింగ్ విధానాలు గనుల్లో బొగ్గు, ఖనిజాల వెలికితీత కోసం నిర్వహించే బ్లాస్టింగ్ ప్రక్రియ అత్యంత సున్నితమైనది అన్నారు జాగ్రత్తతో కూడుకున్నది. గనుల్లో పనిచేసే ఉద్యోగులకు, శ్రామికులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా, అత్యున్నత భద్రతా ప్రమాణాలను పాటించే విషయంలో సింగరేణి యాజమాన్యం ఎంతో శ్రద్ధ వహిస్తుందన్నారు బ్లాస్టింగ్ సిస్టమ్‌ను రూపొందించడం జరుగుతుందని అన్నారు, అండర్ గ్రౌండ్ లోనూ



ఓసీలలోను జరిగే బ్లాస్టింగ్ విధానాన్ని పిపిటి ప్రజెంటేషన్ ద్వారా క్లుప్తంగా వివరించారు.అలాగే రక్షణతో కూడిన ఉత్పత్తితోపాటు సంక్షేమ కార్యక్రమాలు కూడా సింగరేణి యాజమాన్యం ముందుంటుందని ఈ సంవత్సరానికి గాను మహిళలకు, యువతీ యువకులకు, టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషన్ మరి కంప్యూటర్ శిక్షణ తరగతులు ఈ నెలలో ప్రారంభించుకోబోతున్నాం.ఎప్పుడు ఎప్పుడు అని ఎదురుచూస్తున్న రామకృష్ణాపురం ఓసిపి అతి త్వరలో ప్రారంభించబోతున్నామన్నారు.ఉద్యోగులు అధికారుల సహాయ సహకారాలతో అండర్ గ్రౌండ్ గనులలో 100% ఉత్పత్తి సాధించేలా, అలాగే ప్రతి ఒక్కరూ రక్షణ నాణ్యత తో కూడిన ఉత్పత్తిని సాధించేందుకు కృషి చేయాలని కోరారు.ప్రతి నెలా వెల్ఫేర్ ఆఫీసర్లు పర్సనల్ అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్న మన్నారు.ఈ కార్యక్రమంలో ఏరియా కేకే ఏజెంట్ ఖాదిర్, కేకేఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ రాంబాబు, ఏరియా ఇంజనీర్ ఈ అండ్ ఎం, బాలాజీ భగవతి జ, డీజీఎం పర్సనల్ సిహెచ్. అశోక్, డీజీఎం ఐఈడి కిరణ్ కుమార్, సీనియర్ పిఓ కార్తీక్ ఈ కార్యక్రమంలో తదితరులుపాల్గొన్నారు

# ఎస్ఏ-1 పరీక్ష సరళిని పర్యవేక్షించిన డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ

**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి అక్టోబర్ 01:** కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల (బాలురు) ను జిల్లా గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు జాదవ్ అంబాజీ గురువారం ఆకస్మికంగా సందర్శించి నేటితో ప్రారంభమైన ఎస్ఏ-1 పరీక్షల సరళిని పర్యవేక్షించి ఉపాధ్యాయులకు సలహాలు, సూచనలు ఇచ్చారు.ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల హాజరు, పరీక్షల విధివిధానాలు, వసతి గృహ నిర్వహణ, భోజనశాల, వంటశాల, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ, వైద్య సదుపాయాలు, విద్యార్థుల భద్రతా చర్యలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి విద్యాభ్యాసం, భోజనం నాణ్యత, వసతి సౌకర్యాలు, ఆరోగ్యం, పాఠశాలలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, పౌష్టికాహారం అందేలా ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థుల ఆరోగ్యం, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, విద్యా



సౌకర్యాలు విద్యార్థులకు పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.అనంతరం పాఠశాలలోని రికార్డులు, విద్యార్థుల హాజరు, వసతి గృహ నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి, విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. పాఠశాలల నిర్వహణ మరింత మెరుగుపడాలని, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడమే గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన లక్ష్యమని జాదవ్ అంబాజీ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, వార్డెన్ లక్ష్మయ్య, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలలో జోనల్ ఆఫీసర్ అపర్ణ ఆకస్మిక తనిఖీ

**కారేపల్లి, అక్టోబర్ 01:** కారేపల్లిలోని శ్రీ కవిత ఇంజినీరింగ్ కళాశాల భవన్ లో కొనసాగుతున్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలను భద్రాద్రి జోన్ జోనల్ అధికారి పి.అపర్ణ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడిన ఆమె విద్య బోధన, వసతి, భోజనం, ఆరోగ్యం, మౌలిక సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతున్నట్లు విద్యార్థినులు తెలిపారు. అనంతరం పరీక్షల నిర్వహణను పరిశీలించిన జోనల్ ఆఫీసర్ పరీక్షలు సక్రమంగా జరుగుతున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. డైనింగ్ హాల్, కిచెన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రత, పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. క్యాంపస్ పరిసరాల్లో పెరిగిన గడ్డిని తొలగించి



ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థినులకు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణాన్ని నిరంతరం కల్పించాలని పేర్కొన్నారు.

# మెదక్ అభివృద్ధికి కొత్త దిశ..

**ప్రజల కలలను సాకారం చేయడమే లక్ష్యం**
**ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు**
**అభివృద్ధి కాగితాలపై కాదు**
**ప్రతి రోడ్డులో, ప్రతి కూడలిలో కనిపించాలి**
**మెదక్‌కు కొత్త రూపం..**
**ఆధునిక మౌలిక వసతులతో మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం: ఎమ్మెల్యే**
**ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం**
**.. మెదక్ అభివృద్ధి ప్రయాణం ఆగదు**
**డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు**



**మెదక్ 01:** మెదక్ పట్టణ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలు కేవలం శంకుస్థాపనలకే పరిమితం కాకుండా, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా పనులు ముందుకు తీసుకెళ్తామని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు అన్నారు.
మెదక్ పట్టణంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏళ్లుగా ప్రజలు కోరుకుంటున్న మౌలిక వసతులు, రహదారులు, డ్రైనేజీ, ప్రధాన కూడళ్ల అభివృద్ధి, సుందరీకరణ పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.
"మెదక్ ప్రజలు అభివృద్ధి అంటే ఏమిటో కళ్లారా చూడాలి. అభివృద్ధి కాగితాలపై ఉండకూడదు.. అది రోడ్లపై కనిపించాలి, డ్రైనేజీ వ్యవస్థలో కనిపించాలి, ప్రధాన కూడళ్ల రూపంలో కనిపించాలి, ప్రజలకు అందుతున్న మౌలిక వసతుల్లో కనిపించాలి. అదే మా లక్ష్యం" అని రోహిత్ రావు అన్నారు.
మెదక్ పట్టణానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావడానికి ప్రధాన కూడళ్ల అభివృద్ధి, సుందరీకరణతో పాటు ప్రముఖుల విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఛత్రపతి శివాజీ మహారాజ్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మేజర్ ధ్యాన్‌చంద్ వంటి మహనీయుల స్ఫూర్తిని భావితరాలకు అందించేలా ఈ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని పేర్కొన్నారు."విగ్రహాలు ఏర్పాటు చేయడం మాత్రమే మా ఉద్దేశం కాదు. ఆయా మహనీయుల ఆలోచనలు, సేవలు, త్యాగాలు, స్ఫూర్తి ప్రజలకు మరియు భావితరాలకు గుర్తుండేలా ఈ ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్నదే మా ఆలోచన" అని ఎమ్మెల్యే తెలిపారు.మెదక్ పట్టణంతో పాటు రామాయంపేట ప్రాంత అభివృద్ధికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, పట్టణాల్లో రహదారులు, డ్రైనేజీ, జంక్షన్లు, సుందరీకరణ, ఇతర మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేస్తామని చెప్పారు."ప్రజలు మాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవడం మా బాధ్యత. ప్రతి వార్డులో ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తాం. ఒక్కో సమస్యకు పరిష్కారం చూపుతూ, ఒక్కో ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తూ ముందుకు సాగుతాం" అని రోహిత్ రావు స్పష్టం చేశారు.మెదక్‌ను కేవలం ఒక సాధారణ పట్టణంగా కాకుండా అందమైన, ఆధునిక, సౌకర్యవంతమైన మోడల్ పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని ఎమ్మెల్యే తెలిపారు."మెదక్‌కు కొత్త రూపం తీసుకురావాలి. పట్టణంలోకి వచ్చే ప్రతి ఒక్కరికీ అభివృద్ధి స్పష్టంగా కనిపించేలా చేయాలి. ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న మార్పు ఇప్పుడు ఒక్కొక్కటిగా ఆచరణలోకి వస్తోంది. ఈ అభివృద్ధి ప్రయాణం ఇక్కడితో ఆగదు.. మెదక్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దే వరకు కొనసాగుతుంది" అని ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు, తో పాటు మెదక్ మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతి రాజ్, వైస్ చైర్మన్ డి. నరేష్ గౌడ్, మున్సిపల్ అధికారులు,వార్డు కౌన్సిలర్స్,కో ఆప్షన్ సభ్యులు,పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీలు,టౌన్ అధ్యక్షుడు ఎం. గంగాధర్, మైనారిటీ టౌన్ అధ్యక్షుడు మహ్మద్ ఫాజిల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వయోవృద్ధులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య**

**మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 01:** వయోవృద్ధులు తమ హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. నరేందర్ రాథోడ్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి, వయోవృద్ధుల సంఘాల ప్రతినిధులతో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మాట్లాడుతూ సమాజంలో వస్తున్న మార్పులపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతోందని, వయోవృద్ధుల అనుభవం, వారి సలహాలు, సూచనలు సమాజానికి ఎంతో అవసరమని తెలిపారు. తల్లిదండ్రులు తమ ఆస్తులు, భూములను పిల్లలకు బదలాయించిన అనంతరం నిర్లక్ష్యానికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆస్తిపాస్తులు లేని వయోవృద్ధులను వారి పిల్లలు బాధ్యతగా చూసుకోవాలని తెలిపారు. వయోవృద్ధులు సమాజానికి విలువైన సంపద అని, కుటుంబానికి పెద్దలుగా వారు అందించే అనుభవం సమాజానికి కూడా ఎంతో ఉపయోగకరమని తెలిపారు. వయోవృద్ధుల హక్కులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత ముఖ్యమని, వయోవృద్ధులు క్రమం తప్పకుండా నడక, యోగా వంటి ఆరోగ్యకరమైన కార్యకలాపాలను కొనసాగించాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న చట్టాల ద్వారా వయోవృద్ధులకు రక్షణ కల్పించడం జరుగుతుందని తెలిపారు. రెవెన్యూ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో చట్టాన్ని అమలు చేయడం, గ్రామ, మండల స్థాయిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో సుమారు 35 వేల 250 మంది వయోవృద్ధులు వృద్ధాప్య పింఛన్లు



పొందుతున్నారని, ప్రతి నెలా పింఛన్లు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు, మహిళా సంఘాల ప్రతినిధులు గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళలకు వయోవృద్ధుల హక్కులు, సంక్షేమంపై సలహాలు, సూచనలు అందించాలని తెలిపారు.జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాట్లాడుతూ వయోవృద్ధులు తమకు కల్పించిన చట్టపరమైన హక్కులపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల సంక్షేమ చట్టం--2007లోని సెక్షన్ 23 ప్రకారం, వయోవృద్ధులు బదలాయించిన ఆస్తికి సంబంధించిన పరిస్థితులలో తగిన సందర్భాలలో ఆర్.డి.ఓ. కు బదలాయింపును రద్దు చేసే అధికారం ఉంటుందని వివరించారు. సెక్షన్ 24 ప్రకారం వయోవృద్ధులను, తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే వారిపై చర్యలు, జరిమానా వంటి నిబంధనలు ఉన్నాయని, ప్రభుత్వ ఉద్యోగులు తమ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే, నిబంధనల ప్రకారం వారి జీతం నుంచి తల్లిదండ్రుల పోషణకు చెల్లింపులు చేయించే అవకాశం ఉన్నాయని తెలిపారు. చట్టంలోని నిబంధనలను పాటించని వారికి జరిమానా, శిక్ష వంటి చర్యలు ఉంటాయని తెలిపారు. ప్రతి మంగళవారం డే కేర్ సెంటర్లలో వయోవృద్ధులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వయోవృద్ధుల సమస్యలు, సహాయం కోసం 14567 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ సేవలను వినియోగించుకోవాలని తెలిపారుఅనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వయోవృద్ధులను అధికారులు సన్మానించారు.
ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, వయోవృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

# కొండగట్టు అంజన్న స్వామిని దర్శించుకున్న జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్

**చొప్పదండి అక్టోబర్ 01:** జగిత్యాల జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని మల్యాల మండలం కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ కుటుంబ సమేతంగా గురువారం స్వామివారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి అంజనా రెడ్డి ఆలయ మర్యాదలతో జిల్లా కలెక్టర్ దంపతులకు స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం కలెక్టర్ దంపతులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరంకార్యనిర్వహణాధి కారి అంజనా రెడ్డి స్వామి వారి శేష వస్త్రంతో జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ దంపతులను సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో అంజనా రెడ్డి, సూపరింటెండెంట్ సునీల్ కుమార్ గౌడ్,ప్రధాన



అర్చకులు చిరంజీవ స్వామి ఇన్స్పెక్టర్ అశోక్, ఆలయ సిబ్బంది, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.